

# తేడా

కేతు విశ్వనాథరెడ్డి

అన్ని గండాలనూ గట్టెక్కించి తమ పెళ్లి జరిపించిన తమ కొలీగ్ నాయుడు పెళ్లికి శ్రీలత, రాఘవ తప్పక వెళ్లాలనుకున్నారు. పెళ్లి రాజంపేటలో.

"పనిలోపని, మీవూరు వెళ్దామండీ! మీ అమ్మా వాళ్లను చూసినట్లుంటుంది. వాళ్లను హైదరాబాద్‌లో మన పెళ్లిరోజు చూసిందే. సంవత్సరమైంది," శ్రీలత రాఘవను అడిగింది.

రాఘవ వెంటనే, 'పోదాం,' అనలేదు.

"ఇద్దరం డెయిలీవేజ్ వర్కర్లమే. వారందినాలు జీతం నష్టం ఎలాగూ తప్పదు. ట్యూషన్లు కూడా నాకు వారం పోతాయి. అయినా ఇలాంటప్పుడు అవి చూసుకుంటే ఎలా? ఇంకేం ఆలోచిస్తారు?"

"సరే," అన్నాడు రాఘవ.

రాజంపేట టౌను కాబట్టి అంతో ఇంతో మేలు సరే. అత్తగారి ఆ పల్లెటూరూ, ఆ ఇల్లూ, ఆ ఇంటి వాతావరణమూ ఇంత అధ్వానంగా, అన్యాయంగా, దుర్భరంగా వుంటాయని శ్రీలత కలలో కూడా అనుకోలేదు. కడప ప్రాంతాల్లోని గ్రామకక్షలు, హత్యలు, మొండి పట్టుదలలు, అభిమానాలు, కరువులు - వీటి గురించి రాఘవ అప్పుడప్పుడు కబుర్లు చెప్పకపోలేదు. వార్తా పత్రికల్లో కూడా శ్రీలత వీటిని గురించి ఎప్పుడో ఒకప్పుడు చదవకపోలేదు. కబుర్లు కన్నా, వార్తలు కన్నా వాస్తవం కర్కశమైంది.

రైలు దిగాక రెండు బస్సులు మారవలసి వచ్చింది. రోడ్డు దిగి ఒక కిలోమీటరు పైగా నడవవలసి వచ్చింది. హైదరాబాద్‌లో ఇంటి నుండి బస్‌స్టాపుల దాకా నడవటాలూ, వాటికోసం పడిగాపులూ, వాటిలో బాధలూ నిత్యం అనుభవమే కాబట్టి, శ్రీలతకు ఆ నడక కష్టమనిపించలేదు. కానీ అత్తగారి ఊరి పరిసరాల్ని చూసీ చూడ్డంతోనే శ్రీలత జడుసుకుంది.

ఊరికి ఒక పక్క బోడికొండ గుట్టలు. మరొకపక్క బండరాళ్ల దీవులున్న, నీళ్లంటూలేని నల్లటి ఇసుకవంక, చెట్లూ చేమల్లేని మెట్టచేలు. ఊరి ముందు కాస్త పచ్చదనమున్న ఒకటీ అరా తోటలు, ఆకాశంలో ఈ ఊరికి కొంత దూరంలో వున్న సిమెంటు ఫ్యాక్టరీల పొగగొట్టాల్లోంచి వచ్చే దుమ్ము పొగలు, అవే అక్కడి మబ్బులు, ఊళ్లో ఒకటో రెండో వేపచెట్లు.

అత్తగారిల్లు శ్రీలతకు చుట్టూ గోడలు కట్టిన స్తంభాల మంటపంలాగా తోచింది. ఇంట్లోకి వెళుతూనే కుడివైపు గాడి, పశువులు, కసువు, పేడ, గంజు, ఎడమ వైపు వంటావార్పూ, తిండీ తీర్థమూ, నులక మంచాలూ, ఈగలూ. తాము వెళ్లినరోజు రాత్రి వేసిన పడకలను చూసి శ్రీలతకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోని జనరల్ వార్డులు గుర్తుకొచ్చాయి. జంతువులూ, మనుషుల సహజీవనం శ్రీలతకు ఘోరంగా కనిపించింది. కరెంటు రోజులో ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదు. అత్తగారి ఊళ్లో వున్న ఆ వారంరోజుల్లో శ్రీలత తను పుట్టి పెరిగిన తెనాలి దగ్గర్లోని గ్రామాన్ని కనీసం ఐదారు పర్యాయాలు గుర్తు చేసుకుంది.

తను పుట్టినూరు... ఊరి బయట తామరకొలను, చుట్టూ నీటితో కలకలలాడే పంటకాలువలు, పంట పొలాలు, పొలాల్లో వరినాట్లూ, వరికోతలూ, నూర్పిళ్లూ, ఎప్పుడూ మనుషుల సందడి... ఇళ్ల ముందూ, పెరళ్లలో కొబ్బరిచెట్లూ, బాదంచెట్లూ, పూలమొక్కలూ. ఏదో ఒక్క ఎకరా మాత్రమే భూస్థితి కలిగిన తమ ఇంట్లో కూడా ఒక కొబ్బరిచెట్టు. శుభ్రంగా పడుకోడానికి ఒక గది.

మనుషుల కాపురానికి దూరంగా పెరట్లో గేదెల కొట్టం. నీళ్లకు కరువులేదు. గాలికి కరువులేదు. కంటికి కన పడే దరిద్రం లేదు. అత్తగారి ఊళ్లో అన్నిటికి కరువే.

హైదరాబాద్‌లో భరత్‌నగర్ కాలనీలో కాపురం ఉంటున్న తమ ఇంటి కంటే, అత్తగారిల్లు విశాలంగా కనిపించడంవల్ల శ్రీలత సమాధానపడింది.

మెట్టినూరినీ, అత్తగారింటినీ తన అనుభవంలో పోల్చి చూసుకోవడంవల్ల అవి ప్రశ్నార్థకాలయ్యాయి. అత్తగారింట్లోని వాతావరణం ఒక పదబంధ ప్రహేళికలా కనిపించింది. ఆ ఇంట్లో శ్రీలతకు గొడ్డుచాకిరీ చేసే వెట్టి వాళ్లలాగా అత్తగారూ, భర్త మేనత్తా కనిపించారు. అత్త గారు తెల్లవారుజామున్నే లేచేది. అప్పటినుంచీ రాత్రి ఏ తొమ్మిదింటిదాకానో పనిచేస్తూనే వుండేది. పాలు పితకడం, మజ్జిగ చిలకటం, కాఫీలు, అన్నాలు చేయడం, చెరుక్కోవడం, విసురుకోవడం, నీళ్లు తెచ్చు కోవడం, తోట దగ్గరకు సంగటి గంపనెత్తుకొని పోవడం, కళ్లం నుంచి మేపు తేవటం, గొడ్లకు మేపు వేయడం, వాటికి నీళ్లు తాపటం, వాటిని కడగడం, బోకీ బోలే కడుక్కోవడం- ఇవన్నీ ఒక మరమనిషిలాగా ఆమె చేయడం శ్రీలత గమనించింది. డెబ్బై ఏళ్ల ముసలామె భర్త మేనత్త, వంగిన నడుంతోనే కసువు ఊడ్చడం, పేడ తీయడం, గంజు ఎత్తడం, మరేదో పని చేయడం శ్రీలత చూసింది. ఆ ఇద్దరి చాకిరీ చూశాక శ్రీలతకు వాళ్లమీద తన తల్లి మీదలాగే గౌరవం ఏర్పడింది. అయితే శ్రీలతకు మామ గారి మీదా, బావగారి మీద తన తండ్రి మీదలాగా సద్భావం ఏర్పడలేదు.

శ్రీలత తన తండ్రితో మామ, బావలను పోల్చి చూసుకుంది. తన తండ్రి వున్న ఆ ఒక్క ఎకరాలోనే కష్టపడి తనను ఎం.ఏ., చదివించాడు. టైపు నేర్పిం చాడు. శ్రమ పట్ల గౌరవాన్ని కలిగించాడు. సొంత వ్యక్తిత్వం అలవరచుకోవడానికి సాయపడ్డాడు. మామ గారి పని బీడీలు తెగ కాల్చడం, వచ్చేపోయే వాళ్లతో ఏవో మాట్లాడుతూ కూర్చోవడం. బావగారి పని సిగరెట్లు కాలుస్తూ రాజకీయాలు చర్చించడం. వాళ్లిద్దరిలోని సోమరితనాన్నీ, డాబునూ, దర్పాన్నీ కాకమ్మ కబుర్లనూ చూశాక, ఒక పని ముట్టకుండా తిరగటాలు పరిశీలిం చాక శ్రీలతకు కంపరమెత్తింది. పని ముట్టుకోవడం పాపం అనుకునే వాళ్లను తాను పనిచేసే ఆఫీసులో చూసింది. కాని తన ఊళ్లో చూళ్లేదు. తన భర్త రాఘవలో తాను అప్పుడప్పుడు దర్శిస్తున్న లక్షణాలకు మూలాలేవో మామ, బావల్లో శ్రీలతకు దొరికినట్లయింది.

ఆ మూలాలు మరిది దివాకర్‌లో కూడా పరిశీ లించడానికి శ్రీలత రెండు రోజులు ప్రయత్నించింది. ఇంటర్ పాసయి చదువు మానేసిన దివాకర్‌లో శ్రీలతకు ఆ మూలాలేవీ కనిపించలేదు. ముప్పై నలభై బిందెల నీళ్లను దూరాన వున్న బావి నుంచో, బోరింగు నుంచో తేవడంలో తల్లికి తోడొస్తున్న దివాకర్‌ను చూసి శ్రీలత మెచ్చుకోకుండా వుండలేకపోయింది. రాఘవ ముందు మనసారా మెచ్చుకుంది కూడా. 'వాడి మొగం, ఇంకే పనిచేస్తాడు?' అని రాఘవ కొట్టి పారేశాడు. తాను మాత్రం నీళ్లబిందెలు ఎదురందుకోవడానికి మాట వరుసకైనా వెళ్లలేదు. 'డైలీ వేజస్ వితవుట్ ఆర్డర్స్' కింద రోజుకు ఇరవై అయిదు రూపాయిలకు కూలి చేస్తున్న తన భర్తలో శ్రీలత ఎం.ఎ. గీరను ఎప్పుడో గుర్తించింది. 'మానవశ్రమ పట్ల ఆరాటం కానీ, గౌరవం కానీ, సానుభూతి కానీ ఆ మహానుభావుడికి లేవని ఇక్కడ రుజువైంది,' అని శ్రీలత అనుకుంది.

వచ్చిన మూడోరోజు నీళ్ల బిందెలందుకోవటానికి శ్రీలత వెళ్లింది. ముందు అత్తగారు, "నీకెందుకమ్మా, మేమున్నాం కదా?" అని ఆప్యాయంగా గట్టిగానే వారిం చింది. "నీకెందుకొందినా, నేనున్నా కదా!" అని దివాకర్ అన్నాడు. శ్రీలత బలవంతంగా అత్తగారి వద్ద నుంచి బిందె అందుకుంది. వదిన అంటే దివాకర్‌కు గౌరవం ఏర్పడింది. ఆరకంగా చనువూ ఏర్పడింది. ఆరోజు తీరిక దొరికినప్పుడు హైదరాబాద్ కబుర్లు శ్రీలత నుంచి దివాకర్ రాబట్టాడు. కొంత సాహిత్యచర్చ కూడా చేశాడు.

ఆ మరురోజు సాయంత్రం శ్రీలత రాఘవను అడిగింది.

"తోటన్నా చూసి వద్దాం. వెళ్దాం పదండి"

"నాకు కొంచెం ఊళ్లో పనుంది. దివాకర్ తీసుకు పోతాడు. పోయిరా," అన్నాడు రాఘవ, అక్కడే వున్న దివాకర్ వైపు చూస్తూ.

దివాకర్ వెంట ఊరి బయటి తోటల్ని చూడ డానికి శ్రీలత బయలుదేరింది. దారిలో దివాకర్ అడిగాడు.

"మా తోటలూ దొడ్లూ ఏం చూస్తావొదినా? మీ వైపులాగా వుంటాయనుకోకు."

"మా తెనాలి వైపు తెలుసా?"

"ఎందుకు తెలీదు? తెలుగు సినిమాలు చూసినా కదా?"

దివాకర్ హాస్యోక్తిని ఆనందిస్తూ శ్రీలత అడిగింది.

"తెలుగు సినిమాల్లో ఏం చూశావు?"

"అదేం వదినా! కాలువ గట్లూ, టెంకాయ చెట్లూ, వరిపైర్లూ, చెరుకుతోటలూ, పూలతోటలూ, ఆ సీనరీ మధ్య సూటుల్లోనో, పంచెకట్టుల్లోనో ఎగరటాలూ, ఎగరవేసిన చీరల నడుమ గెంతటాలూ- అవన్నీ ఆ పక్క మీపక్క పల్లెల్లో తీసినవేకదా! ఈ ఊళ్లో సీనరీ ఏముంది? ఇక్కడ సినిమాలు తీస్తే ప్రొడ్యూసర్లు మట్టి గొట్టుకొని పోతారు. ఫిల్ము డబ్బాలను వెంకటేశ్వరుడు కూడా రక్షించలేడు."

దివాకర్ నవ్వులో శ్రీలత తన నవ్వును జతకలిపి అంది.

"ఇక్కడ సీనరీ లేకేం దివాకర్? ఈ ఊరూ, దూరంగా ఈ సిమెంట్ ఫ్యాక్టరీలూ..." పరిసరాల్ని అసహ్యించుకొన్నది మరిచి ఆవేశంలో శ్రీలత అంది.

"సినిమాల్లో సీనరీల మాటేమో కానీ వదినా! ఆ ఫ్యాక్టరీలే ఇప్పుడు భూములు పోగొట్టుకున్న రైతులకు దిక్కయినాయి. ఇక్కడి అభివృద్ధి ఇదే."

"అంటే?"

"ఏముంది? కరువుల్తో, అప్పుల్తో భూములమ్ము కోక తప్పదు. అమ్ముకొన్నాక కూలికో నాలికో పోక తప్పదు. భూములు పోగొట్టుకున్న వాళ్లందర్నీ భరించే పొలాలు కావుకదా ఇవి, కనీసం మీ ప్రాంతాల్లోలాగా?"

దివాకర్ తెలివితేటల మీద శ్రీలతకు గురి ఏర్ప డింది. కాసేపు ఆలోచించి అంది.

"అసలు కారణం అదికాదేమో! మారే పరిస్థితు లతోపాటు మారకపోవడం కారణమేమో? మా సంగతి తీసుకో. మాకుండేది ఒక్క ఎకరం. నాన్న పొలం చూసు కుంటూ, పెరట్లో ఆకుకూరలూ, కాయగూరలూ పండి స్తాడు. కోళ్లను పెంచుతాడు. మా అమ్మ రెండు ముర్రా గేదెలను పెట్టుకుంది. పాలు అమ్ముతుంది. అలా శ్రమ పడతారు."

"నువ్వు మా నాన్ననూ, పెద్దన్ననూ మనసులో పెట్టుకుని అంటున్నావనుకుంటా. ఏమైనా వాళ్లు ప్రేమ్ చంద్ శవదహనం కథలోని తండ్రీ కొడుకులు కారులే వదినా!"

దివాకర్ వైపు శ్రీలత ప్రశ్నార్థకంగా చూసింది.

"అదే వదినా! ఆ కథ కఫన్ ఆధారంగా తీసిన 'ఒక ఊరి కథ' చూసి వుంటావు కదా?"

శ్రీలతకు తట్టింది. ఆ సినిమాను చూసింది. శ్రీలత మరింత ఆశ్చర్యపోయింది, తన మనసులో భావాల్ని దివాకర్ పసిగట్టినందుకు. 'ఇంత తెలివి గల వాడు చదువెందుకు మానుకున్నట్లు,' అని శ్రీలత ఆలోచనలో పడింది.

దివాకర్ చెప్పుకుపోయాడు.

"నాన్నది పాతతరం. తన పెండ్లి కాకముందున్న యాభై ఎకరాల ఆస్తీ, సేద్యగాళ్లూ, నలుగురు వచ్చే పోయేవాళ్లు, మందీ మార్బలం ప్రపంచంలో పీకల్దాకా మునిగి వున్నాడు. పాత కలల్లో బతుకుతున్నాడు. చిలువ పట్టిన పెద్ద రెడ్ల దర్జా. పెద్దన్న సులభంగా డబ్బు సంపాదించాలనుకుంటాడు. రాజకీయాల్లో దిగితే ఎప్పటికైనా సంపాదించలేకపోతానా అని వాటిని పూసుకొని తిరుగుతాడు. పెద్దన్నకు తెలియంది ఒకటే, వీళ్ల రాజకీయాలకు పెట్టుబడి వుండాలని. మోసాన్ని పెట్టుబడిగా పెట్టగల తెలివితేటలు పెద్దన్నకు ఉన్నా యనుకోను."

"మరి నువ్వేం చేయాలనుకున్నావు?"

ఎదురుచూడని వదిన ప్రశ్నకు దివాకర్ తబ్బిబ్బు అయ్యాడు. ఆలోచనలు కూడగట్టుకొని మిరపతోట వైపు చూస్తూ అన్నాడు.

"నేనా? మన ఈ రెండెకరాల తోటా ఆయకంలో వుంది. వెలిపొలం ఏడెకరాలుంది. అది ఒక ఏడాది పండుతుంది. మరొక ఏడాది ఎండుతుంది. ఈ గొడవల్లో ఆస్తి పంచమని నానా గొడవ చేసి పెద్ద వదిన పుట్టింటికి పోయింది, పిల్లలిద్దర్నీ తీసుకొని. ఏం పంచు కొని తిందామనుకున్నారో, అట్టడుగు చేరుకునే రోజు లొస్తున్నాయి."

ఆ అట్టడుగు ఏమిటని శ్రీలత అడగలేదు. దివాకర్ మాటలనుబట్టి సంసారం స్థితిని ఊహించు కుంది. నీళ్లు సరిగ్గాలేక గిడసబారి ఒకటి ఆరా మిరప కాయల్తో ఉన్న మిరపతోటలను చూశాక, ఆ ఊహకు ఒక వాస్తవాకారం ఏర్పడింది. తాను నాలుగు రోజులుగా చూస్తున్న ఇంట్లో ఖర్చులు, దుబారా గుర్తుకొచ్చాయి.

ఈ అట్టడుగులోంచీ తన భర్త భాగానికి దొరికే చిల్లిగవ్వంటూ వుండదని శ్రీలత భావించింది. ఇక్కడ జీవితాన్ని నెలనెలా పదహారు వందలకు పైగావచ్చే తమ ఇద్దరి సంపాదనతో శ్రీలత పోల్చి చూసింది. తామే మెరుగు అనుకుంది. దివాకర్‌ను హైదరాబాద్ పిలుచు కుని వెళ్లి, ఏ అటెండరు ఉద్యోగమో ప్రయత్నిస్తే అను కుంది. ఉద్యోగం అంత సులభంగా దొరకదని అను కుంది. ఇక్కడ ఇట్లాంటి పరిస్థితుల్లో దివాకర్ లేకపోతే ఇంకా సమస్యలొస్తాయి అనుకుంది. అత్తగారి నీళ్ల బరువును దివాకర్ తగ్గించడం గుర్తుకొచ్చింది. ఏ సహాయమూ ఇప్పట్లో చేయలేని నిస్సహాయత్వానికి శ్రీలత సిగ్గుపడింది.

ఏదో కలిగించుకుని అడగాలని శ్రీలత అడిగింది, "మా ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చెయ్యక పొయ్యావా?"

"సమయం రానీలే వదినా! తీరిక ఉన్నప్పుడల్లా అవో ఇవో చదువుతున్నాలే- పక్క ఊళ్లో ఒక స్నేహితుని దగ్గర్నుంచి తెచ్చుకుని."

శ్రీలత మనసు నిర్వేదంతో నిండిపోవడం వల్ల, 'ఏం చదువుతున్నా,'వని అడగలేకపోయింది.

తోటలో ఎండిపోయిన ఒక మిరపమొక్కను పీకి దూరంగా వేస్తూ దివాకర్ అన్నాడు.

"చూడొదినా! నువ్వు ఎం.ఏ. సోషియాలజీ చదివినావు. అన్న ఎం.కాం. చదివినాడు. అన్న చెప్పినాడు- నీదేమో 'డెయిలీ వేజెస్ విత్ ఆర్డర్స్', అన్నదేమో 'వితవుట్ ఆర్డర్స్' నాలుగేండ్లుగా పనిచేస్తే రోజుకు ఇరవై ఐదు. ఇక్కడ ఆడకూలీల సంగతటుంచు. మగ కూలీలకు రోజుకు ఇరవై. ఫ్యాక్టరీలో ముప్పై ఐదుకు పైన వస్తుంది. ఏ శ్రమ గొప్పంటావు? చిన్నన్నను అడిగితే 'మాదే గొప్పదంటా' డనుకో. అది వేరే విషయం. నా ఉద్దేశంలో అసలు ఏ శ్రమకూ వ్యక్తిగతంగా విలువ వుండదనీ, లేదనీ- మీ చదువులకూ, మీరుచేసే ఉద్యోగాలకూ సంబంధం లేనట్లు."

తన భర్త ఇంట్లో మనిషేనా ఈ దివాకర్ అని శ్రీలత ఆశ్చర్యపోయింది.

"చీకటి పడతావుంది. పోదాం వదినా?" అన్న పిలుపుతో శ్రీలత ఆశ్చర్యం నుంచి తేరుకుంది.

హైదరాబాదుకు వెళ్లడానికి ముందురోజు, చుట్టూ ఎవరూ లేనిది చూసి భర్తతో అత్తగారింటి విషయాలను, ముఖ్యంగా దివాకర్ భవిష్యత్తును చర్చించింది.

"వాడిక్కడ వుండడమే మేలు. వీడు లేకపోతే ఇంటి దగ్గర వ్యవసాయం కట్టిపెట్టాల్సిందే. వీడు చదువు మానేసినందువల్ల అదొక మేలు జరిగింది. పైగా చదువు ఖర్చులు తగ్గినాయి. వీడి పుణ్యమా అని ఒకటి రెండేళ్లు కాస్త మంచి పంటలు పండితే, రేపు మనం భాగం ఏదన్నా అడిగినా ఇస్తారు."

భర్త రాఘవ దూరాలోచననూ, పగటి కలలనూ చూసి శ్రీలత విస్తుపోయింది.

రాఘవతో శ్రీలత హైదరాబాదు చేరుకున్నాక, ఒక వారం పది దినాలు అత్తగారి ఊరినీ, ఆ ఇంటినీ మరువలేకపోయింది. ఆలోచించినప్పుడల్లా, ఆ ఇంటి దుస్థితికి ప్రధాన కారణం కాలానుగుణంగా మారకపోవడమే, ఒళ్లు వంచి కష్టపడి సంపాదించుకోకపోవడమే అని నమ్మింది. ఆ ఊరి ప్రకృతీ, పర్యావరణమూ, ఇంటి ఆర్థికసూత్రాలూ శ్రీలతకు అర్థమైనట్లూ, కానట్లూ తోచాయి. రెండు వారాలు గడిచాక తన సమస్యల తిరగలిలో- ఆఫీసు, ట్యూషన్లు, ఇంటి పనిలో పడిపోయింది.

ఆఫీసులో పనిదొంగల్నీ, బుల్లి రాజకీయవాదుల్నీ చూసినప్పుడూ, మొత్తం ట్యూషన్లనూ, ఇంటి పనిని తన నెత్తి మీదనే వేస్తున్న భర్తను పరిశీలించినప్పుడూ మామగారూ, బావగారూ శ్రీలతకు గుర్తుకొచ్చేవారు. వాళ్లతో రాఘవను పోల్చి చూసుకునేది. చొరవేలేదు కానీ, భర్త అంత అన్యాయం కాదు అని అనుకునేది. తన చాకిరీని మెట్టినింట్లోని అత్త, భర్త మేనత్తల వెట్టిచాకిరితో పోల్చుకునేది. విసుక్కునేది. ఉద్యోగస్తులైన ఆడవాళ్ల చాకిరీ మరింత అన్యాయం అనుకునేది. మహిళా సమస్యల్ని చిత్రించిన ఏ కథో, నవలో చదివినప్పుడు ఇంకా మండిపడేది. అత్త, రాఘవ మేనత్తల మూగబాధ ఎలా వుంటుందోనని ఆలోచించేది. కాలానుగుణంగా తామిద్దరూ మారేదెలా? తమ పరిస్థితిని చక్కదిద్దుకునేదెలా? అని తెగ ఆలోచించేది. శ్రీలత ఊహల్లో తామిద్దరి ఉద్యోగాలూ ఖాయమై పోయేవి. తండ్రి తనకివ్వబోయే ఇల్లూ పొలమూ అమ్ముడుపోయేది, ఆ డబ్బుతో ఇళ్ల స్థలం కొనుక్కునేది, ఇల్లు కట్టుకునేది. ఒక్కొక్కప్పుడు ఆమె కలల్లో ఆర్డరు లేని భర్త ఉద్యోగం ఊడిపోయేది.

అత్తగారిల్లు శ్రీలతను చాలారోజులు వేధించింది. ఒక్క ఏడాది గడిచింది. శ్రీలత కుటుంబ జీవితంలో ఏ మార్పూ రాలేదు.

ఆ రోజు శ్రీలతకు దివాకర్ నుంచి ఒక ఉత్తరం అందింది.

'శ్రీలత వదినా!

నా ఇంటర్‌మీడియట్ తెలుగు పరిజ్ఞానంతో రాస్తున్న ఈ ఉత్తరంలో తప్పులుంటే ముందుగా క్షమించు. మరీ క్షమించవలసినవి ఏకవచన ప్రయోగాలు. అవి ఈపాటికి అలవాటయి వుంటాయిలే. నువ్వు మన ఊళ్లో ఉన్నది వారందినాలే అయినా, నీ గ్రహణశక్తి మీద నాకెంతో గౌరవభావం ఏర్పడింది. అంతేకాదు, నువ్వు హృదయమున్నదానివి. ఆయకంలోని తోట అప్పులవాళ్ల పాలైంది. మెట్టసేద్యంలో ఏడాది పొడువునా పని ఎట్లాగూ వుండదు. అన్నట్టు తోటల దగ్గరకు మనం పోతున్నప్పుడు నువ్వన్నావు. పరిస్థితులతో పాటు మారకపోవడమూ, శ్రమను నమ్ముకోక

పోవడమూ ఇక్కడి దుస్థితికి కారణమని. మీ అమ్మా నాన్నలతో పోలిక తెచ్చినావు. మీ అమ్మ రెండు గేదెలను పెట్టుకుని పాలు అమ్ముతుందనీ, నాన్న సేద్యంతో పాటు కాయగూరలూ అవీ కాయించీ, కోళ్లను పెంచీ కొంత సంపాదిస్తాడనీ. అప్పుడు నేను జవాబు చెప్పలేదు. దీనికి ఆ శ్రమ మీద నాకు గౌరవం లేకపోలేదు. కానీ ఆ రకం శ్రమ మీద కన్నా, ఆ సంబంధాల మీదకన్నా, సిమ్మెంటు ఫ్యాక్టరీలో పనిచేసే కూలీల శ్రమ మీదా, వాళ్ల సంబంధాల మీదా నాకు నమ్మకం ఏర్పడింది. నేనందుకే వాళ్లలో కలిసిపోయాను. శ్రమ ఖరీదు తెలుసుకుంటున్నా.

ఇంటితో బంధాలు తెగిపోయినాయి, మూగజీవి అమ్మతో తప్ప. నాకు వచ్చే చచ్చే ఏ ఆస్తీ అక్కరలేదని బయటపడినా. ఆ ఊబిలోంచి బయటపడడానికి అదొకటే మార్గంగా నాకు కన్పించింది. లేకపోతే కట్నం ఆశపడతారు. రాజీ పడితే కొన్నాళ్లకు ఇక్కడ నేను మా నాన్నగానైనా మారిపోవాలి, మా పెద్దన్నగానైనా మారాలి. మా చిన్నన్న రాఘవ మాదిరి నేను కుదురు మనిషిని కాదు.

ఇప్పుడైనా మా నాన్నకూ, పెద్దన్నకూ తెలిసి వస్తే మంచిదే. లేకపోతే ఇట్లాగే కొన్నాళ్లు బతుకునీడ్చి, మా అమ్మ, మా వదిన కూలిపనులకు పోతే వాటిమీద తమ రకం బతుకు బతక్కపోరు.

మా భూమి చరిత్రా, భూమి పుత్రుల చరిత్రా ఈ రకంగా తప్ప, మరొక రకంగా వుంటుందంటావా? చిన్నన్నను అడిగినట్టు చెప్పు.

మీ
మరిది దివాకర్

శ్రీలత ఈ ఉత్తరాన్ని నాలుగైదు మార్లు చదువుకుంది. కలవరపడింది. క్షోభపడింది. నిర్వేదపడింది. భర్త రాఘవకు చూపినప్పుడు, సాంతం చదివి కటువుగా రెండే ముక్కలన్నాడు.

"వీడు జైలుక్కూడా పోయేరకం... చావనీ. ఇంక ఊరి దగ్గర్నుంచి మనకేమీ వచ్చేదుండదు. మీ అమ్మా నాన్న మిగిలించి ఇచ్చేదేదో తప్ప."

భర్త శాపనార్థాలను విన్నాక, ఆశలను చూశాక శ్రీలత ఇరవై ఏళ్ల మరిది దివాకర్, ఇరవై ఆరేళ్ల భర్త కంటే చాలా చాలా ఉన్నతంగా కన్పించాడు. కానీ ఆమె అనుకున్న ఎత్తు మూలాలు దివాకర్‌కు ఎక్కడినుంచి వచ్చాయో అని ఎప్పుడూ ఆలోచిస్తూనే వుంటుంది పాపం!

*ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక, 1990*

